# భద్రత

◆పి. సత్యవతి



**మహాబలిపురం బీచ్ హోటల్లో రెండు రోజులు జరగబోయే అఖిల భారత సేల్స్ సమావేశానికి ఎగ్జిక్యూటివ్‌లందర్నీ వారి వారి భార్యలతో సహా రమ్మని అధికారులు ఆహ్వానించారన్న విషయం 'మోహన్‌కి చాలా ఆనందం కలగజేసింది.**

ఆ విషయం అతను చెప్పినప్పుడు అందరు "ఎగ్జిక్యూటివ్" భార్యల్లా ఎగిరి గంతు వెయ్యనందుకు అతను నన్ను కొంచెం విసుక్కున్నాడు అలవాటుగా — నాకు 'ఎగ్జిక్యూటివ్' భార్య లక్షణాలు బొత్తిగా లేవనీ, అందుకు కారణం — నేను పుట్టిన ఇల్లు, మా తాత, మా ముత్తాత, మా వంశం, నా పెంపకం, నేను పీల్చే గాలీ అని...అతనిచ్చిన సుదీర్ఘోపన్యాసం నాకు అలవాటే.

నిజానికి, ఈ కాన్ఫరెన్స్ జాతరంటే నాకు మహా కంపరం. వెళ్ళకపోతే తరువాత నే నెదుర్కోవలసిన పరిణామాలు తలుచుకుంటేనూ నాకు కంపరమే — అంచేత అప్పుడప్పుడు — (అదేం మాటలెద్దూ —) ఎప్పుడూ కూడా అతన్ని సంతోష పెట్టడంలో నష్ట పోయేదేమీ లేదని (ఏమైనా వుంటే కదా నష్టపోవడానికి) సర్దిచెప్పుకుని ప్రయాణానికి సిద్ధమైపోయాను — సరేననడంతోనే ప్రయాణానికి ఏర్పాట్లు 'ఎగ్జిక్యూటివ్' స్థాయిలో జరిగిపోయాయి —

"మరి కస్తూరిబాయి గాంధీ చీరెలు సర్దకు - తెలుసుగా - మా కంపెనీ డైరెక్టర్ల భార్యలు, జనరల్ మేనేజర్ భార్య — మా దక్షిణాది డిపోల మేనేజర్ల భార్యలు అంతా బ్రహ్మాండంగా వస్తారు — నీ సింప్లిసిటీ మీ వూళ్ళో చూపించుకో—" అని అలవాటుగా నా కొక హెచ్చరిక కూడా ఇచ్చేడతను — ఆ హెచ్చరిక అందుకోక ముందే నేను 'ఎగ్జిక్యూటివ్' భార్య చీరెలు సూట్‌కేసులో సర్దాను — మద్రాసు వరకూ ఫస్టు క్లాసులో ప్రయాణం — అక్కడ నించీ కంపెనీ ఏర్పాటుచేసిన కారుల్లో మహాబలిపురం ప్రయాణం — సముద్రం వొడ్డున కట్టిన హోటల్‌లో కుటీరాల్లాంటి "కాటేజీ"లు చాలా అందంగానూ, కృత్రిమంగా కూడా వున్నాయి. "హాయ్"లూ, 'హలో'లు — 'థ్యాంక్యూ'లు, 'వెల్‌కం'లు అయ్యాక మా 'గుడిసె'లోకి మేం చేరాం. — అప్పటికే సాయంత్రం పార్టీకి ఏర్పాట్లు వేగంగా జరిగిపోతున్నాయి —

"ఈ ఇంట్రూడర్‌ని క్షమించాలి" అని ఓ బుర్ర మీసాలాయన లోపలికి వచ్చాడు —

'హలో మీనన్ — ' అని మోహన్ అతన్ని కౌగలించుకున్నాడు.

"ఇతను మీనన్ — ఎర్నాకులం బ్రాంచ్—"

"మిసెస్ మోహన్—"

మీనన్ నన్ను పాదాల దగ్గర్నుంచీ తల వరకూ, పరిశీలించి (ఏ మాత్రం సిగ్గు లేకుండా) "హలో"

"జ్ఞాపకాలు"

## నిజమైన బ్రహ్మచారి

"బోధ గురువులు, బాధ గురువులు అని రెండు రకాలు" అన్నారు రామకృష్ణ పరమహంస. బోధ గురువుల వల్ల మహోన్నతులైన శిష్యులు ఉద్భవిస్తారు. బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు అట్టి బోధ గురువులలో ఒకరు. దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి ఎందరో మేధావులు ఆయన శిష్యులై గొప్పవారైనారు.

బందరులో రఘుపతి వెంకటరత్నం నాయుడుగారి వద్ద విద్యాభ్యాసం చేసిన వారిలో వేమూరి రామకృష్ణారావు ఒకరు. వెంకటరత్నంగారు చదువుతోపాటు పిల్లలకు శీలసంపద ఎలా సంపాదించుకోవాలో చెప్పేవారు.

ఆయన ప్రభావం వేమూరి రామకృష్ణారావు మీద ఎంతగా పడిందంటే, ఆయన భార్య కాపురానికి రాకుండానే చనిపోయింది. అయినా ఆయన తిరిగి వివాహం చేసుకోలేదు. భార్యతో సంసారమే లేదు గదా! ఆయన శ్రీరామచంద్రునిలా జీవితాంతం ఏకపత్నీ వ్రతుడైన బ్రహ్మచారిగా గడిపారు. వేమూరి వారు కాకినాడ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా ఎంతో పేరొందారు. నిరంతరం విద్యార్థులకు ధన సహాయం చేసేవారు.

— డాక్టర్ మల్లిప్రియ "నాగరాజు"

అన్నాడు చాలా స్టయిల్‌గా—

నేనూ అలాగే అనేసి మొహం తిప్పేసుకున్నాను—

సాయంత్రం పార్టీకి కాక్‌టెయిల్స్ సమకూర్చే పనిని అతనికి అప్పగించారట — మోహన్ సాయం కావాలట —

"తీసుకెళ్ళు బాబూ — హాయిగా సముద్రం చూస్తూ కూర్చుంటాను—" అనుకున్నాను నేను —

ఆ చిన్న కుటీరం సిగరెట్ పొగతో నిండిపోయింది — నేను బయట కుర్చీ వేసుకుని కూర్చున్నాను—

అక్కడ ప్రకృతి ఎంత అందంగా వున్నా — ఎంత హాయిగా వున్నా — ఏదో లోటు — కృత్రిమత్వం కనపడుతూనే వున్నాయి. చాలా అందంగా వున్న అమ్మాయి, ఎర్రటి రంగుతో పెదాలు పాడు చేసుకున్నట్లు — చక్కటి కనుబొమల్ని పెన్సిల్ గీతల్లా గొరిగేసినట్లు — తెల్లటి గోళ్లకి ముదురు రంగు పాలిష్ వేసినట్లు — నిడుపాటి వెంట్రుకల్ని పిచ్చి పిచ్చిగా కత్తిరించి పిన్నులు పెట్టినట్లు, ప్రకృతిని కూడా ఫ్యాషనబుల్‌గా తయారుచేసినట్లు అనిపిస్తోంది—

సముద్రం ముందు కుటీరం — కుటీరం ముందు కుర్చీల్లో నిక్కర్లు తొడుక్కున్న మగవాళ్ళు, వాళ్ళ నోళ్ళల్లో సిగరెట్లు, వాళ్ళ ముందు సీసాలు — ఆడవాళ్ళ వేషధారణలో వెగటుదనం — మొత్తం వాతావరణంలోనే వెగటుదనం — మోహన్‌ని బుర్ర మీసాల స్నేహితుడు తీసుకువెళ్ళగానే నేను స్విమ్మింగ్ పూల్ కేసి నడిచి వెళ్ళాను — చల్లగా బావుంది — ఈత కోసం వచ్చినవాళ్ళు — ఈత వేసే అమ్మాయిల్ని చూడ్డానికొచ్చినవాళ్ళు — ఈతలు కొడుతున్న వాళ్ళు — ఈతలు కొట్టేసి బయటికొచ్చిన వాళ్ళు — సన్నటి నాజూకు శరీరాల వాళ్ళు — బాన పొట్టల వాళ్ళు, బట్టతలల వాళ్ళు — చిన్న ముసలి వాళ్ళు, ముసలి చిన్నవాళ్ళు, వారి భార్యలు, వారి భర్తలు — మోహన్ భాషలో అంతా 'ఎగ్జిక్యూటివ్' స్థాయిలో వున్నారు — కొందరు మా మల్టీ నేషనల్ వాళ్ళు — ఇంకొందరు అలాంటి మరో మల్టీ నేషనల్ వాళ్ళు — వ్యాపారులు — సినిమా వారు — పెర్కులతో, రోజువారీ పెగ్గులతో పొట్టలు పెరిగినవారు, ఖరీదైన ఆట్టహాసపు జీవితానికి అలవాటుపడ్డవారు — అప్పుడు చూశాను, ఆ అమ్మాయిని — ఎక్కడో చూసినట్లున్న ఆ అమ్మాయిని — మిసిమి రంగు మేనితో, తళుకులీనే కళ్ళతో, వంకీల జుత్తుతో తటిల్లతలా, తళుక్కున మెరిసి మాయమైన ఆ అమ్మాయి నాకు బాగా తెలిసిన అమ్మాయి ... గుర్తురావడం లేదు...

ఆ అమ్మాయి పక్కన నడిచి వెళ్ళినతను ఆమె తండ్రి వయస్సు వాడిలా వున్నా తండ్రి కాదని నాకనిపించింది. అతని నల్లని శరీర ఛాయ, పెరిగిన పొట్ట, పలచని జుత్తు — ఆమె అన్న కూడా కాదని తెలుసుకున్నాను — అతను స్విమ్మింగ్ పూల్‌లో నుంచీ బయటికి రాగానే ఆమె అతనికి ఘుమఘుమలాడే ఇస్త్రీ తువ్వాల అందించింది — వీపు మీద టాల్కం పౌడర్ చల్లింది — షర్టూ, ట్రౌజర్సూ అందించింది — అతని తడి బట్టల్ని బ్యాగ్‌లో సర్దింది. "ఏమి చేస్తున్నావిక్కడ — పద — పద — స్నానం కానిచ్చి తయారవ్వు — తతిమ్మా వాళ్ళంతా రెడీ అయిపోతున్నారు —" అని మోహన్ తొందరపెట్టకపోతే — ఇంకొంచెం ఆలోచించి మెదడులోని జ్ఞాపకాల అరలన్నీ తెరిచి, వెతికి పట్టుకుని వుండేదాన్ని ఆమె పేరు!

సంబరం మొదలైంది — మగవాళ్ళు కాక్‌టెయిల్స్‌లోకి నడిచే ఆడవాళ్ళంతా ఒక వైపు చేరారు — కొంచెం ధైర్యం వున్న వాళ్ళు వైన్, జిన్ లాంటివి తీసుకుంటే, మరీ బయటపడ్డం ఎందుకులే అనుకున్న వాళ్ళు కూల్‌డ్రింక్స్‌తో కాలక్షేపం చేస్తున్నారు — స్టేట్స్‌లో వున్న సంతానాన్ని గురించిన గొప్పలతో కొందరు, నౌకర్ల సమస్యని గురించి కొందరు, పెరుగుతున్న ధరల్ని గురించి కొందరు, పిల్లల చదువుల్ని గురించి, వాళ్ళ స్కూళ్ళ గొప్పల్ని గురించి, వాళ్ళ మగవాళ్ళ అలవాట్ల గురించి, వాళ్ళ లేట్ నైట్స్ గురించి, వాళ్ళ హాంగోవర్ల గురించి, వాళ్ళ కిష్టమైన దుస్తుల్ని గురించి, వాళ్ళకి తామెలా వుంటే ఇష్టమో గురించి సాగిపోతున్నాయ్ సంభాషణలు — ఒక ప్రక్క పేకాట మొదలైంది —

"ఈ పేకాట సెక్షన్ మొదలైందంటే నాకు మరీ విసుగుబాబూ — శనివారం రాత్రి కూర్చుని సోమవారం ప్రొద్దున్న లేస్తూ వుంటారు మా ఇంట్లో ఒక్కొక్కసారి — వాళ్ళకి మంచింగ్‌లు, భోజనాలు ఏర్పాట్లతో సరిపోతుంది — ఇక పిల్లల్ని చూసుకో డానికి కూడా తీరదు—" అని ముద్దు ముద్దుగా చెప్పింది మిసెస్ నందా.

ఆవిడ చెప్పిన తీరులో ఆ పేకాటని ఖండించినట్లు కాక, ఇష్టపడుతున్నట్లు అర్థం అయింది —

"డార్లింగ్ ఓ నాలుగొందలుంటే ఇటు పడేయ్" అని వచ్చాడు ఒకాయన.

"నా వల్ల కాదు డియర్ — నువ్వన్నావు కదా అని నేను పర్సులో డబ్బు వేసుకురాలేదు—" అని సిగ్గు సిగ్గుగా చెప్పింది డార్లింగ్, మిసెస్ వెంకట్రామన్—

"అలాగే అంటావులెద్దూ—" అని ఆవిడ చేతిలో పర్సు లాగేసుకుని వెళ్ళిపోయాడు డియర్ వెంకట్రామన్.

డార్లింగ్ వెంకట్రామన్ భర్తపైన చాలా ముద్దు ముద్దుగా ఫిర్యాదులు చేసింది — అతనలా పర్సు లాక్కువెళ్ళడం తనకి చాలా నచ్చినట్లు—

అటు ప్రక్కనెవరో కాప్సి కమ్ ఫ్రై ఎలా చెయ్యాలో వివరిస్తున్నారు — వాళ్ళాయన కాప్సి కమ్ ప్రియుడట — "అంటే అది నీ పనితి అన్న మాట—" అని ఒకావిడ చాలా గొప్ప జోకు వేసింది — మిసెస్‌ల బృందం గొల్లుమని ఆ జోకుని చాలా సేపు ఆనందించింది —

"మీ ఆయనలంతా కష్టపడి అమ్మకాలు పెంచి కంపెనీకి లాభాలు తెచ్చినందుకు మీ కందరికీ ఇలా మంచి హాలీడే ఏర్పాటు చేశాం — మీరంతా బాగా ఆనందిస్తున్నారనీ — మీ మీ ఇంటి పనిని మర్చిపోయి హాయిగా గడుపుతున్నారనీ ఆశిస్తున్నాను" అన్నాడు పండిపోయిన ఎర్ర టమేటా మొహం మేనేజింగ్ డైరెక్టర్ — మిసెస్‌లంతా ఆయనకి ధన్యవాదాలర్పించారు —"ఎలాగయినా అమెరికన్ కంపెనీ అమెరికన్ కంపెనీయే—" అని తీర్పిచ్చింది ఒకావిడ—

"అమెరికా అంటే గుర్తొచ్చింది — ఎప్పుడు మీ ప్రయాణం —" అని ఇంకొకావిడ గుర్తుచేసింది —

ఆవిడ తన అమెరికా యాత్ర గురించి యాభై రెండు వారాల సీరియల్ ప్రారంభించింది — తన కూతురికి అమెరికాలో సంబంధం కుదరడం దగ్గర్నుంచి — ఆ పిల్లకి వీసా రాకపోవడం, అటుపైన ఆ పిల్ల విరహ వేదన — అటు నుంచి రోజూ కాల్స్ — ఇటు నుంచీ రోజూ కాల్స్ — నాలుగంకెల్లో టెలిఫోన్ బిల్లులు — వాళ్ళాయన విసుక్కోవడం — తను సముదాయించడం — పిల్ల బెంగెట్టుకుని, జాకెట్లన్నీ

వదులైపోడం ....

ఇంతలో ఇంకొకావిడ తన కూతురికి వెంటనే వీసా రావడం, ఆ పిల్ల ప్రయాణానికి తను చేసిన ఏర్పాట్లు హడావిడి, తను పంపే పచ్చళ్ళు ఏకరవు పెట్టింది —

ఈ సందడిలో నేను చల్లగా జారుకున్నాను — మా జనం కాకుండా అందరూ కూర్చున్న చోటికి వెళ్ళాను — అక్కడ మళ్ళీ కనిపించింది నాకు తటిల్లత — వంకీల జుత్తు — మెరిసే శరీరఛాయ అమ్మాయి — ఆ అమ్మాయీ, వాళ్ళాయనా నడిచి వస్తున్నారు —

.నేను కావాలని దగ్గరగా వెళ్ళి మొహంలోకి చూశాను — అవును — ఆ అమ్మాయి మా అక్క క్లాస్‌మేట్ నీరజ. సందేహం లేదు —


"నువ్వు నీరజవి కదూ?"

ఆ అమ్మాయి నన్ను క్షమిస్తున్నట్లు చాలా దయగా నవ్వి, ఇంగ్లీషులో కాదని చెప్పింది.

నమ్మలేకపోతూనే, క్షమాపణ చెప్పి వచ్చేశాను.

మరునాడు ఉదయం నేను నిద్ర లేచేసరికి, మోహన్ జాగింగ్ చేసి వస్తున్నాడు. అతనితోపాటు, ఇందాక నీరజ చేత వీపు తుడిపించుకుని, పౌడరు చల్లించుకున్నాయన — (ఇలా అంటే బావుండదేమో — నీరజ భర్త) కూడా వున్నాడు. ఇద్దరూ చిరపరిచితుల్లాగ కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. కాటేజీ దగ్గర విడిపోయారు — "ఇతను 'మనవాడే' గుంటూర్లో కళ్యాణీ టొబాకో కంపెనీ ఇతనిదే — సుందర్రావనీ — గుంటూర్లో బాగా డబ్బున్న వాళ్ళల్లో ఒకడు—"

అతను 'మనవాడు' కావడమేకాక డబ్బు కూడా వుండడం అదనపు అర్హత మోహన్ దృష్టిలో మోహన్‌కి "మనవాళ్ళు" అంటే చాలా అభిమానం. 'మనవాళ్ళు' కనపడితే చుట్టరికాలు కూడా తిరగేస్తూ వుంటాడు. నీరజ, నీరజ కాదని చెప్పాక నేను సుందర్రావు భార్యని గురించి ఆలోచించలేదు — ఆమె ఎవరిలా వుందో — వుండడమేకాక, నీరజేనని నేను అనుకున్నాననీ మోహన్‌కి నేను చెప్పలేదు — తరువాత వాళ్ళిద్దరూ కనిపించలేదు — నీరజ మా అక్క పద్మ స్నేహితురాలు — రోగిష్టి తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు — తండ్రి లేకపోవడం, ఇది ఆ అమ్మాయి చరిత్ర — క్లాసులో ఎప్పుడూ ఫస్టు మార్కే. డాక్టర్ కావాలని ఆశ — డాక్టర్ కాకపోయినా నష్టం లేదనీ — అదికాక ఇంకా ఎన్నో చెయ్యవచ్చనీ ఆ అమ్మాయికి ఎవరూ చెప్పలేదులా వుంది — అస్తమానూ డాక్టర్ కావడం గురించి మాట్లాడేది — మా అక్కకి కూడా డాక్టర్ కావాలని వుంది — అందు కోసం నాలుగు సబ్జెక్ట్‌లకీ నాలుగు ట్యూషన్లు పెట్టించింది — క్రాష్ కోర్సుల్లో చేరింది — ట్యూషన్లకి వెళ్ళడానికి మోపెడ్ కొనుక్కుంది — అర్ధరాత్రి దాకా చదువుకుని అలసిపోయి పాలూ, కొబ్బరి నీళ్ళూ తాగేది — ఆ సంవత్సరం మా నాన్న మా అక్క కోసం ఎ.సి. కూడా కొన్నారు — పద్మ నీరజకి తన ట్యూషన్ నోట్సులన్నీ ఇచ్చేది — తనతోపాటు ఎ.సి.లో కూర్చోబెట్టుకుని చదివించేది — ఇద్దర్లో ఒక్కరికీ మెడికల్




ఎంట్రెన్స్‌లో సరయిన ర్యాంక్ రాలేదు — ఒక్క మార్కులో అక్కకి పోయింది — అయిదు మార్కులు తగ్గాయి నీరజకి —

అక్క ఏడ్చి గోలపెడితే నాన్న లక్ష రూపాయలు విరాళం కట్టి, మణిపాల్ పంపారు — నీరజ ఏడిస్తే వాళ్ళమ్మ సముదాయించింది — బి.యస్సీ.లో చేర్పించింది — నీరజ సంతోషంగా వుండడం, ఇదుగో! మహాబలిపురంలోనే మళ్ళీ చూడడం —

నా పెళ్ళి శుభలేఖ ఇవ్వడానికి నీరజ ఇంటికి వెళ్ళినప్పటికి — ఆమె, బి.యస్సీ. పూర్తి చేసుకుని, చిన్న కాన్వెంటు స్కూల్లో నెలకి నాలుగు వందల రూపాయిలకి ఉద్యోగంలో చేరింది — లెక్కలేనన్ని బ్యాంక్ టెస్టులు రాసింది. సర్వీస్ కమీషన్లూ — రైల్వే పరీక్షలూ రాసింది — దేంట్లోనూ సెలెక్ట్ కాలేదు — వరండా నిండా ట్యూషన్ పిల్లలు వున్నారు.

మా స్నేహితురాలు సుజానమ్మకి బ్యాంక్‌లో వుద్యోగం వచ్చింది — ఆ అమ్మాయి బి.ఎ. నాలుగు సార్లు తప్పింది — అమ్మాజీకి ఏదో గవర్నమెంట్ ఆఫీసులో వుద్యోగం వచ్చింది. అరవై వేలు లంచం ఇచ్చిందని పుకారు వచ్చింది — నిజం ఎవరికీ తెలీదు — సుజానమ్మకి మరో బ్యాంక్ మేనేజర్‌తో పెళ్ళయింది — అమ్మాజీ నాలుగు లక్షల కట్నంతో ఓ ఉద్యోగస్తుణ్ణి పెళ్ళాడింది — సిగ్గుపడ్డం దేనికి కానీ — నేనూ కొంత కట్నంతోనే మోహన్‌ని పెళ్ళి చేసుకోబోతున్నాను — రాజీ తప్పదు — ఇంకో స్నేహితురాలు గాయత్రి కూడా పెళ్ళి చేసుకుంది — గాయత్రికి లెక్చరర్ ఉద్యోగం వచ్చింది — వెంటనే సంబంధం కుదిరింది —

నేనిచ్చిన శుభలేఖ అందుకున్న నీరజ కనీసం చిరునవ్వయినా నవ్వలేదు — వాళ్ళమ్మ ఇచ్చిన కాఫీ తాగి బయటపడ్డాను — నేననుకున్నట్లే నీరజ నా పెళ్ళికి రాలేదు — అక్క ఆమెని చూడ్డానికి వెడితే ఇల్లు తాళం పెట్టి అందరూ వూరు వెళ్ళారని తెలిసింది — నా శుభలేఖ అందుకున్న నీరజ కళ్ళల్లో తళుకులు లేవు — శరీరం మిసమిస లాడ్డంలేదు — నిర్లిప్తత మూర్తిమంతం అయినట్లు అనిపించింది — ఇవ్వాల్టి నీరజ రూపం వేరు —

తిరిగి వచ్చి మళ్ళీ ఎగ్జిక్యూటివ్ భార్య అవతారంలో మునిగితేలుతూ వుండగా, హైదరాబాద్ ఏదో పని మీద వెళ్ళవలసి వచ్చింది — తరువాత చాలా రోజులకి మళ్ళీ నాకు హాండ్‌లూం హౌస్‌లో కనిపించింది నీరజ — నేను తలఎత్తి పలకరించబోయేసరికి వెళ్ళిపోయింది — ఎందుకిలా చేస్తూందో, నిజంగా నీరజ కాదేమో అనుకుని, ఆమె గురించి మర్చిపోవడానికి ప్రయత్నించాను — దాదాపు మర్చిపోయాననే చెప్పాలి — సరిగ్గా అప్పుడే జరిగింది ఈ సంగతి — మామయ్య కూతురు జయ పెళ్ళికి గుంటూరు వెళ్ళాం నేనూ, మోహన్.

ఆ పెళ్ళిలో కలిసిన సుందర్రావు మమ్మల్ని తన ఇంటికి ఆహ్వానించేడు — నేను ఎగిరి గంతువేసి బయలుదేరాను — ఈసారి ఎలా తప్పించుకుంటుందో చూద్దాం అని — నీరజకి విస్మయానందం కలిగించాలని!

సుందరరావుగారిల్లు రాజభవనంలా వుంది. డబ్బుతో సమకూరే సౌకర్యాలన్నీ వున్నాయి. బయట ఎండలో నుంచి వచ్చిన మాకు — ఎ.సి. గదిలో ప్రాణం సేదతీరినట్లు వుంది — నేను కూర్చున్న సోఫాకి ఎదురుగా గోడకి చక్కని పెయింటింగ్ వుంది — గది కళాత్మకంగా అలంకరించారు — ఎంతైనా నీరజది మంచి అభిరుచి. పోనీలే పాపం — అటు డాక్టర్ కాలేకపోయింది — ఇటు మంచి ఉద్యోగమూ రాలేదు — మనిషి కాస్త పెద్దవాడూ, చూడ్డానికి బావుండనివాడూ అయినా, సుందర్రావు మంచివాడి లాగే వున్నాడు. కావలసినంత డబ్బు — డబ్బుతోనైనా సుఖపడుతోంది — అదెంత కాదు? ఈ డబ్బు లేకనే కదా అక్కలా మెడిసిన్ చదవలేకపోయింది? ఆ డబ్బు లేకనే కదా అమ్మాజీలా వుద్యోగం కొనుక్కోలేకపోయింది? ఆ డబ్బు లేకనే కదా నాలా భర్తని కొనుక్కోలేకపోయింది! భద్రమైన జీవితం!! నీరజని గురించి ఇలాంటి ఆలోచనలలో నేను సంతోషపడ

దానికి ప్రయత్నిస్తుండగా, ట్రేలో కాఫీ కప్పులతో ఆవిడ లోపలికి వచ్చింది — నీలమేఘచ్ఛాయ, కొంచెం ఎత్తుగా కనిపించే పళ్ళు — మెడ నిండా గొలుసులు — చేతులకు చాలా బంగారు గాజులు — ముక్కుకి రవ్వల పుడక — సుందరరావు అక్కగారేమోనను కుని, పలకరింపుగా చిరునవ్వు చిందించడానికి ప్రయత్నించేను.

"కళ్యాణి — మా ఆవిడ — మా మేనత్త కూతురు కూడా. చిన్నప్పుడు నవలలు రాసింది — ఇప్పుడు మహిళామండలి ప్రెసిడెంటు — బిజీ వుమన్ — మా ఇంటి మహారాణి—" అతిశయోక్తులతో పరిచయం — మోహన్ నా వైపు చూసి "మిస్టర్ నో ఆల్" లాగా నవ్వి నా చెయ్యి గిల్లేడు —

అయినా నేను సర్దుకోలేకపోయాను—

పెద్ద బండరాయొకటి నా నెత్తిన పడ్డట్లయింది — తలలో నరాలన్నీ చితికిపోయాయి. నెత్తురు కళ్ళల్లోకి చిమ్ముకొచ్చింది — గోడలన్నీ దగ్గరకి వచ్చి నన్ను నొక్కేస్తున్నాయి. సుందరరావు బాన కడుపు పెద్దదై, మరీ పెద్దదై నన్ను బయటికి తరుముతోంది. రవ్వల ముక్కు పుడక కొలిమిలా మండి కాల్చడానికి వస్తోంది.

"అయ్యో—" అన్నది ఒక గొంతు.

పెళ్ళి ఇంట్లో పరామర్శలు, పరిచర్యల మధ్య తేలాను— "అదంతా మామూలేనోయ్ — అంతా పెళ్ళాలతోనే హోలీడేకి రారు — టేకిట్ ఈజీ—" అన్నాడు మోహన్.

ఆమె గురించి మర్చిపోవాలని చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు — నేను దాన్ని ఈజీగా తీసుకోలేకపోయాను — తరువాత మాకు హైదరాబాద్ ప్రాంతానికి బదిలీ అయింది — మంచి స్కూళ్ళల్లో పిల్లల్ని చేర్చడానికి వేటతో పాటు అక్కడ కుదురుకోడానికి ఆరు నెలలు పట్టింది — స్థలం మార్పు, ఊపిరాడని దినచర్యతో దాదాపు నేను నీరజని గురించి తలచుకోడం మానేసినట్లే లెక్క — అయితే ఓ రోజు సాయంత్రం అయిదు గంటలప్పుడు నేను ఆబిడ్స్ నుంచీ వస్తూంటే, ఒక ఆఫీసు దగ్గర ఆటో ఎక్కుతూ కనిపించింది నీరజ నాకు మళ్ళీ — ఈసారి నేనామెని విడిచిపెట్టదలచలేదు — ఆఫీసు పేరు జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని టెలిఫోన్ డైరెక్టరీ సాయంతో ఆ ఆఫీసుకి ఫోన్ చేసి నీరజ అనే అమ్మాయి అక్కడ పని చేస్తున్నట్లు తెలుసుకున్నాను — నీరజ ఆ రోజు ఆఫీసుకి రాలేదు. ఎందుకు రాలేదో మేనేజర్ని అడిగి చెప్తానని టెలిఫోన్ ఆపరేటర్ చెప్పింది — అడిగి చెప్పింది — నీరజకి వంట్లో బాగాలేదట. జ్వరం వచ్చిందని మూడు రోజులు — అనగా ఆదివారం దాకా సెలవు పెట్టిందట. నీరజ అక్కడ స్టెనోగ్రాఫర్గా చేస్తోందట — "ఇంటి ఎడ్రస్ చెప్పగలరా!" అంటే మళ్ళీ ఆమె కొలీగ్స్ని అడిగి చెప్పింది — ఆ ఆఫీసుకి ఆటోలో వెడితే కనీసం ముప్పావు గంట దూరంలో వుండే ప్రాంతం — మోహన్ని అడిగి కారు తీసుకుని వెళ్ళాను. ఇంటికి వెళ్ళి కనపడితే తను నీరజ కాదని తిప్పి పంపదనే ధైర్యంతో. ఇల్లు సౌకర్యంగా వుంది — తల్లి సంతోషంగానూ, ఆరోగ్యంగానూ కనిపించింది. చెల్లెళ్ళు యూనివర్సిటీ చదువులకి వచ్చేరు — ఇంట్లో ఆధునిక గృహ సౌకర్యాలన్నీ వున్నాయి — నీరజ ఇంట్లో లేదు — హాస్పిటల్కి వెళ్ళిందేమో —

"నీరజ ఎప్పుడొస్తుందమ్మా!" అంటే ఆవిడ చెప్పింది —

నీరజ వాళ్ళ మేనేజర్తో కలిసి క్యాంప్కి వెళ్ళిందట — ఇంకా మూడు రోజుల దాకా రాదట. అప్పుడప్పుడూ ఆమెకిలాంటి ప్రయాణాలు తప్పవట — మగపిల్లాడిలా ఇల్లు గడుపుతోందట — కళ్ళనిండా ప్రేమ నింపుకుని చెప్పింది ఆ కన్నతల్లి —

"ఆదివారం తప్పకుండా రా అమ్మా! నిన్ను చూస్తే సంతోషిస్తుంది అమ్మాయి" అన్నది—

నేనింటికొచ్చేసరికి మా ఇంట్లో మంచి కొత్త గొంతు వినిపిస్తోంది. చూస్తే డ్రాయింగ్ రూంలో సుందరరావుగారున్నారు — 'మనవాళ్ళ'తో స్నేహాన్ని మోహన్ ఎంత బాగా కాపాడుకుంటాడో తెలుసు — వండుకునే వారికి ఒకటే కూర — అడుక్కునే వారికి అరవైయ్యారు కూరలనీ మా అమ్మమ్మ సామెత చెప్పేది—" అంటున్నది కొత్త గొంతు — సుందరావుది —

ఆ హాస్యోక్తికి అమితంగా ఆనందించిన చిహ్నంగా రెండవ గొంతు పడీపడీ నవ్వుతోంది — హాస్యం చిందించిన గొంతు అందులో శృతి కలిపింది —

"అడుక్కోడం అరవైయ్యారు కూరల కోసం మొదలెట్టరు సార్ — మొదలెట్టడంతోనే అరవైయ్యారు కూరలు ఆటోమేటిక్గా పడిపోతాయి—" అని చెప్పడానికి నాకు ధైర్యం లేదు—

నేను మోహన్ని కారడిగినప్పుడు ఎంతో నిజాయితీగా నీరజ గురించి చెప్పి వుండకపోతే, ఈ అవహేళన వినవలసి వచ్చేది కాదు — అనుకోకుండా దిగిన "మనవాడు", మోహన్ నీరజ గురించి మాట్లాడుకునే వుంటారు. ఆమె నాకు పరిచితురాలని తెలిసి కూడా మాట్లాడుకునే వుంటారు. అలా మాట్లాడుకోగలగడం వాళ్ళ హక్కు.

నాకు సుంద్రావూ, మోహన్ ఒకేలా కనిపించారు — ఇద్దరిలో ఎవరెవరో నేను గుర్తుపట్టలేకపోయాను — వాళ్ళిద్దరి కళ్ళల్లో దాగని అవహేళన నాకు ప్రస్ఫుటంగా కనపడింది. వాళ్ళిద్దరి కళ్ళూ నాకు నాలుగు చెత్తకుండీల్లా కనిపించాయి — ఆ గదంతా కుళ్ళు వాసన వేసింది —

ఇంటికి తిరిగి వస్తూనే నేను ఆలోచించాను.

నే నెందుకిలా నీరజ వెంటపడుతున్నాను. ఆమె నన్ను ఎందుకు తప్పించుకుంటోందో తెలిసిన తరువాత కూడా నేనింత బాగా జీవితంలో స్థిరపడ్డానని చూపించుకోడానికా? "నీ వెలా వున్నావు?" అని అడిగి బాధ పెట్టడానికా? ఆమెని సానుభూతి హింసకు గురిచెయ్యడానికా? ఆమెకి నేనేం చెయ్యగలను? ఆమె తల్లికీ, చెల్లెళ్ళకీ సుఖప్రదమైన జీవితం సమకూర్చే జీవిక సంపాదించిపెట్టగలనా? ఆమెని అర్థం చేసుకుని ఆహ్వానించే మనిషిని వెతికి తెచ్చి పెళ్ళి చెయ్యగలనా? మరెందుకు నాకీ ఉత్సుకత! ఆమె ఎదుట నిలబడే అర్హత నాకు లేదని తెలిశాక నేను వాళ్ళింటికి ఎలా వెళ్ళగలను? నేనింక నీరజ వెంట పడలేను —

"బావుందా నీ స్నేహితురాలు!" మోహన్ ప్రశ్న —

"నీవులు తుడిపించుకునే వాళ్ళంతా ఎంతో బావున్నప్పుడు, తుడిచే వాళ్ళు కొంచెం బావున్నట్లు కనిపించడం చూసి కూడా ఏడవాలా?" అని అడగలేని నా చేతగానితనాన్ని తిట్టుకుంటూ, గొంతులోకి ఎగదన్నుకు వస్తున్న గుండెని లోపలికి నెడుతూ, వంట ఇంట్లోకి వెళ్ళాను — అంతకన్నా భద్రమైన చోటు ఇంకెక్కడుంటుంది కనుక!! ◆

"నిన్ను చూస్తుంటేనే తెలుస్తుంది... నీ పేరు హనుమంతరావని" అని ఎదుటివాడిని గేలిచేశాడట వెనకటికి ఎవడో... సరిగ్గా అలాగే గాంధీజీ నిరాడంబర వేషాన్ని గేలి చేయబోయాడు ఆనాటి బ్రిటిష్ ప్రధాని చర్చిల్. "మిస్టర్ గాంధీ! మిమ్మల్ని చూస్తే చాలు ప్రపంచ ప్రజ అందరికీ ఇండియా ఎంత దరిద్ర దేశమో అర్థమై పోతుంది" అంటూ చర్చిల్ గాంధీగారిని ఆట పట్టించాడు. గాంధీజీ ఏ మాత్రం తొణక్కుండా "అలాగే మిమ్మల్ని చూశారంటే ఇండియా ఎందుకింత దరిద్రంగా తయారైందో కూడా లోకులు తెలుసుకోగలరు" అంటూ చర్చిల్ అట్టహాసపు వేషధారణను పరోక్షంగా వేలెత్తి చూపి కంగు తినేలా చేశారు.

ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ గారు ఆహార మంత్రిగా వుండగా పార్లమెంట్లో దేశంలోని ఆకలి చావులను గురించి చర్చ జరిగింది. ప్రభుత్వం 'హరిత విప్లవం' పేరుతో ఆహారోత్పత్తిని పెంచే పథకాన్ని అమలు చేస్తూ వున్న రోజులవి. ప్రముఖ పార్లమెంటేరియన్ పీలూ మోడీ (ఈయన భారీ కాయం కూడా ఈయన లాగే జగత్ప్రసిద్ధం) "ఇంత పెద్ద ఎత్తున హరిత విప్లవమంటూ మీరు సాధించినదేమిటి? ఆహార ఉత్పత్తులన్నీ మీరు చూపుతున్న లెక్కల్లో కనిపిస్తున్నాయి తప్ప ప్రజలకు అందుబాటులోకి రావడం లేదని ఆకలి చావులు నిరూపిస్తున్నాయి. ఆ ఆహార ధాన్యాలన్నీ ఎక్కడికి పోతున్నాయ్?" అంటూ ఫక్రుద్దీన్ గారిని నిలదీశారు. ఫక్రుద్దీన్ సమాధానమిస్తూ "గౌరవ సభ్యులంతా ఒక్కసారి ఈ ప్రశ్నవడిగిన మన మిత్రుని వైపు చూశారంటే ఆయన ప్రశ్నకు సమాధానం నేను వివరించకుండానే మీకు తెలుస్తుంది." అని పలికేసరికి పార్లమెంట్ భవనమంతటా సభ్యుల దరహాస చంద్రికలో పరవశించింది. శ్రీమతి గొల్లాపిన్ని